సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 7 । మే । 2024



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



అలరించిన సంగీత కచేరీ

సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా ప్రశాంతి నిలయంలో మాళవికా సుందర్ బృందం నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. 8లో

గరిష్టం/కనిష్టం

43.2°/ 25.6°

జిల్లావ్యాప్తంగా సోమవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



బిట్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

హిందూపురం టౌన్: పోలింగ్, కౌంటింగ్‌కు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అన్బుకుమార్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం వారు పోలీసు పరిశీలకులు ఇమ్నాలెన్సా, ఎన్నికల సాధారణ పరిశీలకులు దీపక్ రామ్ చంద్ర తివారీ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి మండల పరిధిలోని 'బిట్' కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. హిందూపురం పార్లమెంట్, పెనుకొండ, కదిరి, మడకశిర, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌కు కేటాయించిన గదులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈవీఎంల భద్రత, నియోజకవర్గాల వారీగా గదుల కేటాయింపు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాధారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండు కౌంటింగ్ కేంద్రాల్లో మీడియా పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారుల వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓలు కదిరి వంశీకృష్ణ, పుట్టపర్తి భాగ్యరేఖ, ధర్మవరం వెంకట శివారెడ్డి, మడకశిర గౌరీ శివశంకర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు.

ఎన్నికల్లో పోలీసులదే కీలక పాత్ర



పోలీస్ హ్యాండ్‌బుక్ విడుదల చేసిన ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో పోలీసులదే కీలక పాత్ర అని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. పోలీసులంతా ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో ఎన్నికల్లో పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడే అవకాశం ఉన్న అసాంఘిక శక్తులను గుర్తించి అణచివేయాలన్నారు. హింసకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణాన్ని కల్పించే బాధ్యత పోలీసులపై ఉందన్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తు విధుల్లో ఉండే పోలీసులు, అధికారులకు ఈ హ్యాండ్‌బుక్ ఎంతో ఉపకరిస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ బుక్కు చదవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, కంజాక్షన్, జాన్ సైదు, శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ విక్రమ్, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ పేరుతో దివ్యాంగులకు ఎర

- బరితెగించిన బీజేపీ నాయకులు

బత్తలపల్లి: ఎన్నికల్లో ఓటమిని ఊహించిన బీజేపీ నాయకులు ఓటర్లకు ఎర వేసి మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఆర్డీటీ సంస్థ పేరుతో దివ్యాంగులకు ఎర వేస్తున్నారు. తంబాపురం గ్రామంలో ఆర్డీటీ సంస్థకు అనుబంధంగా ఉన్న వికలాంగుల సంఘంలోని సభ్యుడు శివయ్యను (తంబాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మన్) మచ్చిక చేసుకున్నారు. ఆర్డీటీ సమావేశం ఉందని అతని ద్వారా సోమవారం గ్రామంలోని దివ్యాంగులను శివయ్య ఇంటి వద్దకే రప్పించారు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ డబ్బులిస్తారని, అందరూ బీజేపీకి ఓటు వేయాలని శివయ్యతో పాటు పలువురు బీజేపీ నేతలు కోరారు. సత్యకుమార్‌కు ఢిల్లీలో పలుకుబడి ఉందని, ఆయనకు మద్దతు తెలిపితే దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లు పెంచడంతో పాటు మరిన్ని పథకాలను అమలు చేస్తారని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ సమావేశం గురించి తెలుసుకున్న గ్రామానికి చెందిన కొందరు నాయకులు శివయ్య ఇంటి వద్దకు చేరుకున్నారు. అప్పటికే బీజేపీ నాయకులు అక్కడ నుంచి జారుకున్నారు. బీజేపీ నాయకులు దిగజారి రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని

ఇప్పుడే ఇలా.. గెలిస్తే ఎలా?





సీఐ మధుపై దౌర్జన్యం చేస్తున్న కందికుంట, ఆయన అనుచరులు (ఫైల్)



కందికుంట దౌర్జన్యాలను నిరసిస్తూ రాస్తారోకో చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు (ఫైల్)

- అధికారులకు కందికుంట ఫోబియా
- పేరు చెబితేనే భయపడిపోతున్న వైనం
- గత ఐదేళ్లూ ఆయన దౌర్జన్యాలు తలచుకుని బెంబేలు
- వ్యక్తిగత దూషణలను గుర్తు చేసుకుంటున్న యంత్రాంగం
- ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధం

కదిరి: దౌర్జన్యాలు..దందాలు..దాడులు..ఇలా చెప్పుకుంటూ పోతే కందికుంట వెంకటప్రసాద్ చేయని అరాచకాలు లేవు. గత ఐదేళ్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయన చేసిన ఆగడాలు అన్నీఇన్నీ కావు. అందుకే కందికుంట పేరు చెబితేనే అధికారులు భయపడిపోతున్నారు. ఆయన అనుచరులు కూడా అదేదారిలో నడుస్తున్నారు. దీంతో ఇప్పుడే ఇలా ఉంటే... పొరపాటును గెలిస్తే పరిస్థితి ఏమిటని అధికార యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ఐదేళ్ల అరాచకాలను తలచుకుంటూ గట్టిగా బుద్ధిచెప్పేందుకు సిద్ధమైంది.

అధికారులపై కందికుంట చేసిన దౌర్జన్యాల్లో కొన్ని..

- కదిరి ఎన్‌జీఓ కాలనీలో భూతగాదా విషయంలో తనకు అనుకూలంగా వ్యవహరించనందుకు అప్పటి కదిరి టౌన్ సీఐగా ఉన్న సొంత సామాజికవర్గానికి చెందిన తమ్మిశెట్టి మధుపై కందికుంట, ఆయన అనుచరులు దాడికి దిగారు. భూమిని చదును చేయడానికి అక్కడికి తీసుకొచ్చిన జేసీబీపై రాళ్లదాడి చేసి.. పెట్రోలు పోసి తగులబెట్టాలని ప్రయత్నించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న సీఐని పత్రికల్లో రాయలేని భాషలో దూషించారు. ఆ తర్వాత నేరుగా సీఐ ఇంటిపైకి దాడికి దిగి.. కుటుంబసభ్యులను భయాందోళనలకు గురిచేశారు. 'సీఐ మధు మా అన్న కందికుంటకు వ్యతిరేకంగా



కందికుంట అనుచరుల దాడిలో ధ్వంసమైన జేసీబీ (ఫైల్)

ఉన్నారు. సీఐని చంపితే వాడికి దిక్కెవరు..' అంటూ కందికుంట అనుచరుడొకరు ఏకంగా ఆడియో కూడా విడుదల చేశారు. ఇది అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. అంతకుముందు మున్సిపల్ ఎన్నికల సమయంలోనూ కందికుంట వెంకటప్రసాద్ తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళుతుంటే ఇదే సీఐ మధు అడ్డుకున్నారు. దీంతో ఆ సీఐపై కందికుంట దౌర్జన్యానికి దిగారు.
- కదిరిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపు విషయంలో ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన టౌన్ ప్లానింగ్ అధికారి రహిమాన్‌ను కందికుంట తీవ్ర పదజాలంతో బెదిరించారు. 'నీపై దాడి చేస్తే ఎవ్వరా నీకు దిక్కు...' అంటూ అందరి ముందూ ఆయనపైకి దూసుకెళ్లారు.
- కదిరి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న బీసీ (రజక) సామాజికవర్గానికి చెందిన కె.ప్రమీళను మహిళ అని కూడా చూడకుండా తనమాట విననందుకు పలుమార్లు బూతులు తిట్టారు. ఏకంగా ప్రెస్ మీట్లు పెట్టి ఎన్నోసార్లు ఆమెను వ్యక్తిగతంగా దూషించారు.
- మదనపల్లి నుంచి బదిలీపై కదిరి మున్సిపాలిటీకి కమిషనర్‌గా వచ్చిన ఎస్టీ మహిళ సుశీలమ్మపైనా కందికుంట తీవ్రస్థాయిలో దౌర్జన్యానికి దిగారు. 'నా అనుమతి లేకుండా ఇక్కడికి బదిలీపై ఎలా వస్తావు?' అంటూ ఆమెను విధుల్లో చేరకుండా అడ్డుకుంటూ కందికుంటతోపాటు అనుచరులు దాడికి దిగారు. దీంతో ఆమె కన్నీరు మున్నీరుగా విలపిస్తూ విధుల్లో చేరకుండానే వెనుదిరిగారు.
- మామూళ్లు ఇవ్వనందుకు కదిరి నియోజకవర్గంలోని వెలిచలమల రోడ్డు పనులు ఆపి అప్పటి ఆర్‌అండ్‌బీ డీఈ రాజగోపాల్‌ను బెదిరించారు. చివరకు తోటి ఉద్యోగులంతా చందాలు వేసుకుని కందికుంటకు కప్పం కట్టారు.
- కదిరి మండలంలోని హమాలీ కాలనీలో తన అనుచరులకు నిబంధనలకు విరుద్ధంగా ఇంటిపట్టాలు ఇవ్వనందుకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అప్పటి తహసీల్దార్ పి.వి.రమణను కందికుంట అందరి ముందు దూషించారు. మండల మేజిస్ట్రేట్ అని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు తిట్టారు. 'నువ్వు నాకన్నా తక్కువ చదువుకున్నావు. నిన్ను ఏసీబీకి పట్టించడం నాకు రెండు నిమిషాలు కూడా పట్టదు. ఇంటిపట్టాలు ఇవ్వమంటే రూల్స్ మాట్లాడతావా? నాకు అనుకూలంగా ఉన్నాడని ఒక వీఆర్‌ఓను బదిలీ చేసి బ్రోకర్‌ను తెచ్చుకుంటావా? నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నాపైన డెకాయిట్ కేసు నమోదైంది.. నీకు తెలీదేమో' అని అప్పట్లో ఆయన అన్న మాటలను అధికారులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు.

అన్ని కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఉండాలి

- ఎన్నికల నిర్వహణలో ఆదర్శంగా నిలవాలి
- శాంతిభద్రతలను అనుక్షణం పర్యవేక్షించాలి
- ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్ర ఐపీఎస్(రిటైర్డ్) ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల సంసిద్ధతపై జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు అన్బు కుమార్, జనరల్ అబ్జర్వర్ దీపక్ రామచంద్ర తివారీ, వ్యయ పరిశీలకులు రిథం బాజ్వా, వినాయక్, అమిత్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ ఇమ్నాలెన్సా, డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు, పలువురు డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపక్ మిశ్రా మాట్లాడుతూ, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించి భావి తరాలకు మంచి సమాజాన్ని అందించాలన్నారు. ఈక్రమంలో రౌడీ షీటర్లు, గొడవలకు దిగే వారిపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు..

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 16,56,775 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరి కోసం 1,852 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 7 మంది రిటర్నింగ్ అధికారులు, 2019 మంది పీఓలు, 2019 మంది ఏపీఓలు, 8,073 మంది ఓపీఓలు, 420 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. 85 శాతం కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు చర్యలు తీసుకున్నామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతోందని, హోం ఓటింగ్‌కు 38 టీంలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు లేపాక్షి మండలంలోని గురుకుల పాఠశాల, మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు హిందూపురం 'బిట్' కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి అనంతపురంలోని జేఎన్‌టీయూ కళాశాలను ఎంపిక చేశామన్నారు. 3వ తేదీ నుంచి బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ కొనసాగుతోందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. జిల్లాలో 356 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఆయా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల రోజున పటిష్ట బందోబస్తుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అధికారి సహదేవుడు, ధర్మవరం, పెనుకొండ, కదిరి, హిందూపురం, పుట్టపర్తి డీఎస్పీలు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దౌర్జన్యాలు అరికట్టాలి

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ మాధవరెడ్డిని కోరిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: టీడీపీ నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకూ ఎక్కువయ్యాయని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎస్పీ మాధవరెడ్డిని కోరారు. కొత్తచెరువు మండలం విరుపాపురంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఆదివారం రాత్రి టీడీపీ నేతలు దాడి చేసిన నేపథ్యంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొత్తచెరువు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కార్యకర్తలు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు ఆదివారం సాయంత్రం అప్పవాండ్లపల్లిలోని పాలడెయిరీకి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు అటకాయించి వారిని చితకబాదడంతో పాటు ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. టీడీపీకి ఓటు వేయకుంటే చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఈ దాడిలో ఒకరికి కాలు విరిగిందని, మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని ఎస్పీకి తెలిపారు. ఈ ఘటనపై ఆదివారం రాత్రే కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దాడులకు తెగబడ్డ టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్పీ మాధవరెడ్డి కొత్తచెరువు సీఐకి ఫోన్ చేసి విచారణ జరిపి కేసు నమోదు చేయాలన్నారు. అలాగే విరుపాపురం గ్రామస్తులు నిర్భయంగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నారన్నారు. ఇలాంటి దాడులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అపలేరన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

అంతకుముందు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కొత్తచెరువు మండలం విరుపాపురంలో పర్యటించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన ప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి కుటుంబాలను పరామర్శించారు. అధైర్యపడవద్దని, ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రచార హోరు



మడకశిరలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప ప్రచారం



హిందూపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, నవీన్ నిశ్చల్



ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి హారతిపట్టి స్వాగతం పలుకుతున్న మహిళ

వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం హోరెత్తించారు. జగనన్న ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రజలు కూడా గ్రామగ్రామానా వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు నీరాజనం పలికారు. హారతులిచ్చి స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించి మద్దతు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



గోరంట్లలో నిర్వహించిన ప్రచారంలో బ్యాలెట్ చూపిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్



తనకల్లు మండలం టీ.సదుంలో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌కు గజమాల వేసిన అభిమానులు



నల్లమాడ మండలం ఎనుమలవారిపల్లిలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

టీడీపీ గూండాగిరి

- ఓటమి భయంతో వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు
- సోమవారం బుక్కపట్నం, గుడిబండ మండలాల్లో అలజడి
- బుక్కపట్నంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తకు గాయాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



టీడీపీ గూండాల దాడిలో గాయపడ్డ రామాంజనేయులు



టీడీపీ నేతల దాడిలో గాయపడిన జగన్నాథ్

పుట్టపర్తి/గుడిబండ: ఓటమి భయంతో జిల్లాలో టీడీపీ గుండాగిరీ చేస్తోంది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు పొందాలని భావిస్తోంది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు లక్ష్యంగా దాడులు చేస్తోంది. సోమవారం బుక్కపట్నం, గుడిబండలలో టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు.

ఇంటింటి ప్రచారం చేస్తుండగా దాడి..

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పసల తిరుపాలమ్మ, నాగభూషణ, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త రామాంజనేయులు తదితరులు సోమవారం బుక్కపట్నం బైపాస్ దిగువనున్న ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇదే సమయంలో రోడ్ షోకు వచ్చిన స్థానిక టీడీపీ కార్యకర్తలు జగదీష్ కుమార్, సంతోష్, గణేష్, సాయి పవన్, బండగుప్ప వీధి పవన్ సాయి, జానకంపల్లి మణికంఠ వైఎస్సార్ సీపీ నేతలపై దాడికి దిగారు. ఈ ఘటనలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, పతంజలి, నీలూరి ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆక్రోశంతో దాడులు..

గుడిబండ మండల పరిధిలోని నాగేపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ కార్యకర్తలు నాగేపల్లికి వచ్చారు. ప్రచారానికి ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో వెనుదిరిగారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగభూషణం, జగన్నాథ్, దాసేగౌడు, ప్రభాకర్ తదితరులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రజలు వారిని ఆదరిస్తుండటంతో ఓర్వలేని టీడీపీ నాయకులు శ్రీధర్, గిరేతిమ్మప్ప, గిరీష్, లక్ష్మీకాంత్, సురేష్ తదితరులు వేటకొడవళ్లు, కట్టెలు, సైకిల్ చైన్లతో వైఎస్సార్ సీపీ నేతలపై దాడులు చేశారు. ఈ ఘటనలో జగన్నాథ్, నాగభూషణలకు తీవ్ర గాయాలయ్యాయి. జగన్నాథ్‌ను ప్రైవేట్ వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్, సర్పంచ్ కరుణాకర్‌గౌడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ప్రత్యేక పరిశీలకుడితో జిల్లా ఎన్నికల అధికారి భేటీ



దీపక్ మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల కమిషన్ నియమించిన పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రాను జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక సమావేశానికి హాజరైన దీపక్ మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఉద్యోగానికి రాజీనామా చేయకుండానే..



టీడీపీలో చేరిన సూర్యశేఖరరెడ్డి

గాండ్లపెంట: మండలంలోని ఎలుగూటివారిపల్లికి చెందిన ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు బి.సూర్యశేఖరరెడ్డి టీడీపీలో చేరారు. ఉద్యోగానికి రాజీనామా చేయకుండానే ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట చేతుల మీదుగా ఆ పార్టీ కండువా కప్పుకుని ప్రచారంలో పాల్గొన్నారు.

తమ్ముళ్లకు ఓటమి భయం

- పార్లమెంట్ వ్యాప్తంగా మారని టీడీపీ నేతల తీరు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఆదరణ చూసి ఓర్వలేక దాడులు
- టీడీపీ కార్యకర్తల వైఖరితో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు



సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం దాదాపు ఖాయమైంది. ఈ మేరకు పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. 2019 ఎన్నికల ఫలితాలకు మించి ఈ సారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మెజారిటీ సాధిస్తారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఓటమి భయంతో టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారు. టీడీపీకి ఓటు వేయకుంటే అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. రాప్తాడు, పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో ఇటీవల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై టీడీపీ కార్యకర్తల దాడులు వెలుగు చూశాయి. ఓటమి భయంతో ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో లొంగలేదనే ఉద్దేశంతో దాడులకు తెగబడుతున్నట్లు సమాచారం. టీడీపీ కార్యకర్తల తీరుతో ప్రజలు విసిగిపోయారు. మరోవైపు దాడులతో చాలామంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఇలా ఉంటే.. అధికారంలోకి వస్తే ఇంకేం చేస్తారోననే భయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

రామగిరిలో వాహనాల ధ్వంసం..

ఫ్యాక్షన్‌లో కొట్టుమిట్టాడుతూ రక్తపుటేర్లు పారిన రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఈ ఐదేళ్ల శాంతి కుసుమాలు విరబూశాయి. చెరువులు నింపి పొలాలకు నీళ్లు పారించి ప్రజల పాలిట అభినవ కాటన్ దొరగా పిలువబడుతున్న తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ప్రలోభాలకు తెరలేపారు. ఇందుకు లొంగలేదనే అక్కసుతో రామగిరి మండలం పీఆర్ కొట్టాలలో వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన వాహనాలపై రాళ్ల దాడికి తెగబడ్డారు.

బత్తలపల్లిలోనూ భయం భయం...

నిత్యం ప్రజల్లో ఉంటూ 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం' పేరుతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టిన సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డినే మరోసారి గెలిపించుకునేందుకు ధర్మవరం నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు టీడీపీ – బీజేపీ మధ్య ఇన్నాళ్లూ సయోధ్య కుదరక ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. రెండు నెలల క్రితం బత్తలపల్లిలో ఇరు పార్టీల నేతల వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కూటమి తరఫున బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు ఓటేస్తే ఏం జరుగుతుందోనని ఆలోచన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

కదిరిలో 'కందికుంట' దౌర్జన్యాలు..

వైఎస్ హయాంలో కాంగ్రెస్‌కు.. జగన్ హయాంలో వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా కదిరి నిలుస్తోంది. గత 2014, 2019 ఎన్నికల్లో కదిరి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారు. మరోసారి కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయి. అయితే ఆస్తులు ఉండాలంటే టీడీపీకి ఓటేయాలని, లేకుంటే స్థలాలు ఎక్కడికక్కడ కబ్జా చేస్తానంటూ ప్రజలను కందికుంట వెంకటప్రసాద్ బెదిరిస్తున్నారు. గెలవకనే ఓవరాక్షన్ చేస్తున్న కందికుంటకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

పుట్టపర్తిలో ఆగని దాడులు..

సత్యసాయి బాబా నడియాడిన పుట్టపర్తిలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మరోసారి విజయం సాధించడం ఖాయమని సర్వేలు చెబుతున్నాయి. అయితే ఓటమి భయంతో ముందుగానే తెలుగు తమ్ముళ్లు దాడులకు తెగబడుతున్నారు. కొత్తచెరువు మండలం విరుపాపురంలో రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై టీడీపీ నేతలు దాడి చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తల తరఫున ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

పెనుకొండలో సవితమ్మ ఇంటికే..

మంత్రి ఉషశ్రీచరణ్ పోటీ చేస్తోన్న పెనుకొండలో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని సర్వేలు వెల్లడించాయి. నియోజకవర్గంలో ఏ పల్లెలో పలకరించినా.. వైఎస్ జగన్ నిలబెట్టిన వారికే మద్దతు ఇస్తామని చెబుతున్నారు. అయితే అతి కష్టంపై టీడీపీ టికెట్ తెచ్చుకున్న సవితమ్మ వర్గీయులు సర్వే ఫలితాలతో దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు బీకే పార్థసారథి వర్గీయులతో పొసగక అమాయక ప్రజలపై తమ ప్రతాపం చూపుతున్నారు.

మడకశిరలోనూ మారని తీరు..

ఎస్సీ రిజర్వుడు స్థానమైన మడకశిరలో సాధారణ ఉపాధి కూలీ ఈరలక్కప్ప విజయం ఖాయమని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే నియోజకవర్గానికి కృష్ణమ్మ జలాలు చేరాయని, ఎంతోమందికి నామినేటెడ్ పదవులు దక్కాయని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం ఓటమి భయంతో సామాన్య ప్రజలను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈసారి టీడీపీకి ఓటేయకుంటే గ్రామాల్లో ఉండనిచ్చే పరిస్థితి లేదని హెచ్చరిస్తున్నారు.

పురం కంచుకోటకు బీటలు..

ఎన్నో ఏళ్లుగా టీడీపీ అభ్యర్థులు గెలుస్తున్న హిందూపురంలో ఈసారి భిన్న ఫలితాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చుట్టపు చూపుగా హిందూపురం వస్తారనే విమర్శలు ఉన్నాయి. స్థానిక నేతలను ఎన్నుకుంటే ఇక్కడే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే హిందూపురం పార్లమెంటు సీటు కూడా వైఎస్సార్‌సీపీ వశం చేసుకుంటుందని చెబుతున్నారు.

అనంతపురం డీఐజీ బదిలీ

అనంతపురం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం సాయంత్రం 5 గంటల్లోపు ఆయన రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండలంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా దాచిన మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సీఐ యతీంద్ర తెలిపిన మేరకు... గరుగుతండా, దొరిగల్లు రోడ్డు ఏబీపల్లి తండాలో చేపట్టిన తనిఖీల్లో నేనావత్ నవీన్‌నాయక్, షేక్ జావీద్ వద్ద నుంచి 160 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.24 వేలుగా ఉంటుంది. నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

875 క్వింటాళ్ల చింతపండు రాక



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 875 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. ఈ–నామ్ ద్వారా వేలం పాటలు నిర్వహించారు. కరిపులి రకం క్వింటా కనిష్టం రూ.8వేలు, గరిష్టం రూ.15వేలు, సగటు రూ.10వేలతో అమ్ముడు పోయింది. అలాగే ఫ్లవర్ రకం కనిష్టం రూ.4వేలు, గరిష్టం రూ.7,600, సగటు రూ.8వేలు ధర పలికింది. ఈ మేరకు మార్కెట్ యార్డు కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

అలరించిన సంగీత కచేరి

ప్రశాంతి నిలయం: సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత కచేరి నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు మాళవికాసుందర్ బృందం చక్కటి స్వరాలతో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు ఘనంగా సన్మానించారు.

కానిస్టేబుళ్ల ఘర్షణపై ఉన్నతాధికారులకు నివేదిక

రొళ్ల: మండలంలోని పిల్లిగుండ్ల చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం కానిస్టేబుళ్లు శివకుమార్, నారాయణస్వామినాయక్ పరస్పరం దాడి చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. కానిస్టేబుళ్లను ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఎదుట హాజరు పరిచి విచారణ చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

కదిరి అర్బన్: మండలంలోని జౌకల గ్రామంలో ఈ నెల 4న వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగభూషణపై హత్య కేసులో నిందితులను కదిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హతుడి అక్క చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జయచంద్రనాయుడు, జయరాంనాయుడు, గోవర్ధన్‌నాయుడుని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. నేడో.. రేపో వీరిని అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిసింది.

సినీ ఫక్కీలో నగదు అపహరణ

తలుపుల: మండల కేంద్రంలోని ఓ కిరాణా షాపులో సోమవారం ఉదయం సినీ ఫక్కీలో నమ్మించి నగదు అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. వివరాలు... తలుపులలోని ఓబీఆర్ రోడ్డులో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న రసూల్ సోమవారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లోని తన ఖాతా నుంచి రూ.1.55 లక్షలు డ్రా చేశాడు. అనంతరం ఆ డబ్బు తీసుకెళ్లి దుకాణంలోని తన క్యాష్ కౌంటర్ డెస్క్‌లో భద్రపరిచాడు. అయితే బ్యాంక్‌లో రసూల్ డబ్బు డ్రా చేసినప్పటి నుంచి డెస్క్‌లో భద్రపరిచే వరకూ ప్రతి కదలికనూ క్షుణ్ణంగా గమనిస్తూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కాసేపటి తర్వాత నేరుగా వెళ్లి రసూల్‌ను కలిశాడు. తాను తిరుమలకు వెళుతున్నానని, సరుకులు కావాలంటూ ఓ పట్టీ చేతికి ఇచ్చాడు. లెక్కకట్టిన రసూల్ రూ.5వేలు అవుతుందని తెలిపాడు. ఇందుకు దుండగుడు అంగీకరిస్తూ కొన్ని పండ్లు, పచ్చి టెంకాయలు, స్వీట్స్ కూడా కావాలని, అయితే నిష్టలో ఉండడంతో తాను వాటిని తాకకూడని పరిస్థితి ఉందని నమ్మబలికాడు. ఎలాగైనా వాటిని తెచ్చిపెట్టాలని అభ్యర్థించాడు. దీంతో రసూల్ వాటిని తీసుకువచ్చేందుకు వెళ్లాడు. అదే సమయంలో డెస్క్‌లో ఉంచిన రూ.1.55 లక్షలను దుండగులు అపహరించి, అక్కడి నుంచి జారుకున్నాడు. కాసేపటి తర్వాత దుకాణానికి చేరుకున్న రసూల్... నగదు చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- 24 గంటల్లోపే నిందితుడి పట్టివేత



నిందితుడు కార్తీక్

పావగడ: ఇల్లాలిని హతమార్చి ఇంటి పునాదిలోనే పాతిపెట్టిన కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. 24 గంటల్లోపే నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ సురేష్ వెల్లడించారు. పావగడ పోలీసు స్టేషన్ పరిధిలోని నేరళకుంటి గ్రామంలో శనివారం రాత్రి జ్యోతి (30) అనే మహిళను భర్త కార్తీక్ హతమార్చి ఇంటి పునాదిలో పాతిపెట్టిన విషయం తెలిసిందే. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న కార్తీక్ తెలివిగా పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి తప్పించుకున్నాడు. మధుగిరి వైపుగా వెళుతున్న రెండు లారీల్లో వేర్వేరుగా తన వద్ద ఉన్న రెండు మొబైళ్లను విసిరి పోలీసులను తప్పుదారి పట్టించారు. అనంతరం మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామానికి చేరుకున్నాడు. అయితే కార్తీక్ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఆదివారం రాత్రి స్థానికులు బంధించి మడకశిర పోలీసులకు అప్పగించారు. విచారణలో తన భార్య జ్యోతిని హతమార్చి ఇంటి పునాదిలో పాతి పెట్టి పరారై వచ్చినట్లుగా కార్తీక్ అంగీకరించడంతో వెంటనే పావగడ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. అదే రోజు రాత్రి 12 గంటలకు డీఎస్పీ రామచంద్రప్ప, సీఐ సురేష్, సిబ్బంది విచారణలో తాను చేసిన నేరాన్ని నిందితుడు అంగీకరిస్తూ జ్యోతిని పాతిపెట్టిన స్థలాన్ని చూపించాడు. దీంతో పునాది స్థలాన్ని తవ్వి జ్యోతి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం హతురాలి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు కార్తీక్‌పై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, విచారణలో కొత్త అంశాలు వెలుగు చూశాయి. వాస్తవానికి జ్యోతి... కార్తీక్ భార్య కాదని పోలీసులు నిర్ధారించారు. శివమొగ్గకు చెందిన జ్యోతి తుమకూరులోని ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండేది. అదే ఆస్పత్రిలో కార్తీక్ సోదరి కూడా పనిచేస్తుండేది. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్తీక్ తరచూ ఆస్పత్రికి వెళ్లి తన సోదరిని పలకరించి వచ్చేవాడు. ఈ క్రమంలోనే జ్యోతితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. దీంతో ఆమెను ఆరు నెలల క్రితం నేరళకుంటికు పిలుచుకు వచ్చాడు. తనకంటే వయసులో ఐదేళ్లు పెద్దదైన ఆమెను పెళ్లి చేసుకోకుండానే సహజీవనం సాగిస్తూ వచ్చాడు. ఈ క్రమంలోనే ఇద్దరి కలహాలు చోటు చేసుకుని చివరకు ఆమె హతమైనట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల ప్రచారంలో యానిమేటర్



టీడీపీ అభ్యర్థి కందికుంట పక్కన ఉన్న యానిమేటర్ ప్రమీల

నల్లచెరువు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట తరఫున ఎన్నికల ప్రచారంలో గొర్లవాండ్లపల్లికి చెందిన యానిమేటర్ ప్రమీల పాల్గొన్నారు. సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. టీడీపీ కండువా వేసుకుని టీడీపీ అభ్యర్థి వెంట ఆమె ప్రచారం నిర్వహించిన అంశం చర్చనీయాంశమైంది.

ప్రమాదంలో ఒకరి మృతి

గార్లదిన్నె: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన క్రిష్టప్ప(52) ఆదివారం గార్లదిన్నెలో ఉన్న తన కుమార్తెను చూసేందుకు వచ్చాడు. రాత్రి కల్లూరుకు వెళ్లిన ఆయన అక్కడ పనిముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై గార్లదిన్నెకు రాంగ్ రూట్‌లో వస్తుండగా ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై కల్లూరుకు చెందిన రైల్వే ఉద్యోగి నరేంద్ర ముంటిమడుగు నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఢీకొన్నాడు. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా క్రిష్టప్పను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నరేంద్రను గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహమ్మద్ తెలిపారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ దుష్ప్రచారం

- ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే చంద్రబాబు ఎత్తుగడలు
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్‌కే సుధీంద్రనాథ్



మాట్లాడుతున్న ఎల్‌కే సుధీంద్రనాథ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి

అనంతపురం కార్పొరేషన్: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్‌కే సుధీంద్రనాథ్, జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రవేశపెట్టిందన్నారు. నీతి ఆయోగ్ పంపిన రఫ్ డ్రాఫ్ట్ ముసాయిదా రాజ్యాంగానికి లోబడి ప్రజలకు మంచి చేసే విధంగా లేదని తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ క్రమం లోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అనుగుణంగా సహజ న్యాయ సూత్రాలను అనుసరించి మార్పు చేసుకోవచ్చని తెలియజేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని, పేద ప్రజలకు న్యాయం చేసేలా చట్టాన్ని తయారు చేసి అసెంబ్లీలో ఆమోదం చేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. బిల్లు లోపభూయిష్టమని, ప్రజలకు అన్యాయం జరుగుతుందని చెప్పే టీడీపీ నాయకులు, బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.

ఎమ్మెల్యే పయ్యావుల మెచ్చుకోలేదా?..

అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఈ చట్టం ప్రయోజనకరమని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. 'ఈటీవీ' అన్నదాత కార్యక్రమంలోనూ మంచి చట్టమని, గతంలో రెండు పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చే వారని అలా కాకుండా ఒకే డాక్యుమెంట్ ఇస్తారని చెప్పింది వాస్తవం కాదా? అన్నారు. అలాంటి వారు నేడు దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. చట్టానికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత హైకోర్టుకు వెళ్లారని, ఈ క్రమం లోనే కోర్టు స్పందిస్తూ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రావాలని, రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే అప్పుడు చూస్తామని, దీనిపై ఎక్కడా మాట్లాడకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినా, చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. ఇది కచ్చితంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. చట్టం పూర్తిగా అమలులోకి రావాలంటే భూముల సర్వే జరగాలని, ఆ తర్వాత ప్రభుత్వం టైటిలింగ్ అధికారులు, అప్పిలేటింగ్ అధికారులను నియమించి, గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే అప్పుడు పరిపూర్ణంగా అమలులోకి వస్తుందన్నారు. ఇతర దేశాల్లో ఈ చట్టం మంచి ఫలితాలను ఇచ్చిందని వివరించారు. టీడీపీ దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పార్థుని ఎదుటే 'తమ్ముళ్ల' ముష్టి యుద్ధం

గోరంట్ల: టీడీపీలో వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని మల్లాపల్లి గ్రామంలో టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి పార్థసారథి, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపల్లి పంచాయతీ నాయకులు దేవ నరసింహప్ప, నరేష్ యాదవ్ వర్గాలు పార్థసారథి సమక్షంలో ముష్టి యుద్ధానికి దిగాయి. టీడీపీ మాజీ మండల కన్వీనర్, దేవ నరసింహప్ప, మల్లాపల్లి గ్రామానికి చెందిన నరేష్ యాదవ్‌కు కొంతకాలంగా పార్టీలో ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఇరువర్గాలు బలనిరూపణలో భాగంగా పరస్పర దాడులు చేసుకున్నాయి. కళ్లముందే నేతలు వాదులాడుకుంటూ పరస్పర దాడులకు దిగినా పార్థసారథి చూస్తూ మిన్నకుండిపోయారు. ఏ వర్గాన్ని మందలించినా ఓట్లు పోతాయన్న భయంతో అక్కడి నుంచి మెల్లగా జారుకున్నట్లు తెలుస్తోంది.

రాప్తాడులో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- స్పష్టం చేస్తున్న సర్వే ఫలితాలు
- నియోజకవర్గానికి సంబంధించి లోకల్ మేనిఫెస్టో విడుదల



లోకల్ మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

రాప్తాడు రూరల్: రాప్తాడు నియోజకవర్గంలో రెండోసారి వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడబోతోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పలు సర్వేలు స్పష్టం చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, రానున్న రోజుల్లో చేయబోయే అభివృద్ధి పనుల హామీలకు సంబంధించి 'లోకల్ మేనిఫెస్టో'ను సోమవారం సాయంత్రం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలసి కలసి ఆయన విడుదల చేశారు. 12 నిమిషాల నిడివి గల వీడియోతో పాటు 8 పేజీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాప్తాడులో పరిటాల సునీత కంటే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 23 శాతం ఓట్ల ఆధిక్యతతో ముందుంటాడని వివిధ సంస్థల సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ఇంటిలిజెన్స్ విభాగాలతో పాటు వైఎస్సార్‌సీపీ చేయించిన సర్వేలు కూడా ఇదే అంశాన్ని చెబుతున్నాయన్నారు.

లోకల్ మేనిఫెస్టో ఇలా...

- నియోజకవర్గంలో 5 వేల ఇళ్లకు ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఇప్పించాం. మూన్నెళ్లల్లో మరో 10 వేల ఇళ్లకు గ్యాస్ కనెక్షన్లు ఇప్పిస్తాం.
- కందుకూరులో మూసేసిన ఎఫ్‌సీఐ గోదామును తెరిపించి 400 మందికి, రామినేపల్లి వద్ద కొత్తగా నిర్మించిన గోదాములో దాదాపు వెయ్యిమందికి ఉపాధి కల్పించాం.
- రామినేపల్లి వద్ద సగం ధరకే ఎంఐజీ లేఔట్ల ఇంటి ప్లాట్లను వెయ్యి మందికి ఇచ్చాం. రానున్న రోజుల్లో మరో ఐదు వేలమందికి ఇవ్వబోతున్నాం.
- రూ. 300 కోట్లతో జాతీయ, రాష్ట్ర, ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు పూర్తి చేశాం.
- సంక్షేమ పథకాల కింద అర్హులైన వారికి రూ. 3 వేల కోట్ల లబ్ధిని చేకూర్చాం.
- 50 వేల మందికి పింఛన్లు మంజూరు చేయించాం.
- 88 వేల మందికి రేషన్‌కార్డుల ద్వారా రూ.190 కోట్ల విలువైన బియ్యం అందేలా చర్యలు తీసుకున్నాం.
- 76 వేల మంది విద్యార్థులకు అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాకానుక ద్వారా లబ్ధి చేకూర్చాం. విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా 42 వేలమంది విద్యార్థులు లబ్ధి పొందారు.
- ఆసరా, సున్నా వడ్డీ ద్వారా 72 వేలమంది మహిళలకు లబ్ధి చేకూరింది.
- 58 వేలమంది రైతులు రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందుకున్నారు.
- మరోసారి అధికారంలోకి రాగానే కొత్తగా 15 విద్యుత్ సబ్‌స్టేషన్లు తీసుకొస్తాం.
- ఇప్పటికే 4 వేల ఉచిత బోర్లు వేయించాం. మరో 6 వేలు బోర్లు వేయిస్తాం.
- 10 వేలమందికి గేదెలు, ఆవులకు సంబంధించి రుణాలు ఇప్పిస్తాం.
- మూడు రిజర్వాయర్ల నిర్మాణం, జీడిపల్లి నుంచి పేరూరు డ్యాంకు ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లిచ్చే పథకాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తాం.
- గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 51 గ్రామాలకు ఆర్నెళ్లలో తాగునీరు అందజేస్తాం.
- పీఏబీఆర్ నుంచి అనంతపురం రూరల్, ఆత్మకూరు, కనగానపల్లి మండలాల్లోని 110 గ్రామాలకు నాలుగు నెలల్లో ఇంటింటికి 16 గంటల పాటు తాగునీటి సరఫరా ఉండేలా చేస్తాం.
- 17 వేల ఇళ్లు మంజూరు చేయించాం. కొత్తగా మంజూరైన మరో 11 వేల గృహ నిర్మాణాలను రెండు నెలల్లో పూర్తి చేయిస్తాం.

క్లుప్తంగా

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేద్దాం



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న అపర్ణారెడ్డి

పుట్టపర్తి టౌన్: ఈనెల జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రతిపక్షాలను తరిమి కొడదామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డు, 9వ వార్డు కర్ణాటకనాగేపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమెకు కర్ణాటకనాగేపల్లిలో గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పూలహారాలు, హారతులతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఇంటింటా పసుకు కుంకుమ ఇచ్చి ఆప్యాయంగా పలకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకొన్నట్టేనన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, బోయ శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం

ఓడీచెరువు: ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం సున్నంపల్లి పంచాయతీలోని ఎంబీ క్రాస్, నందివారిపల్లి, వంచిరెడ్డి పల్లి, సున్నంపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. యూత్ కన్వీనర్ హరినాథరెడ్డి, ఎంపీటీసీ గంగులప్ప, సీనియర్ నాయకులు కుర్లి రంగారెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసరెడ్డి, డీలర్ శ్రీనివాసులు వీరాంజి, ఆదినారాయణ, మలక వెంకటరెడ్డి, సూరి, నంది పురుషోత్తం, బాబు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



మామిళ్లకుంట క్రాస్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాఘవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రజాశ్రేయస్సే పరమావధిగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బామమరిది రాఘవరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం కొత్తచెరువు మండలం లోచర్ల పంచాయతీ మామిళ్లకుంట క్రాస్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి సంక్షేమ ఫలాల కోసం మరోసారి శ్రీధర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా శ్రీధర్‌రెడ్డిని, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పిల్లలను బడుల్లో చేర్పించేలా చర్యలు



చిన్నారి వివరాలు తెలుసుకుంటున్న అలెస్కో ఆనందబాబు

పెనుకొండ: పట్టణంలోని జీబీసీ కాలనీ, బోయపేట తదితర ప్రాంతాలను సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ అలెస్కో ఆనంద్‌బాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సదరం స్లాట్ బుక్ చేయించి సదరం సర్టిఫికెట్ వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. మాటలు రాని పిల్లలను, నడవలేని వారికి ప్రతి సోమవారం భవిత సెంటర్‌కు వచ్చే విధంగా చర్యలు చేపట్టి వారికి ఫిజియో థెరఫీ ఇవ్వాలని ఐఈఆర్పీలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సూచించారు.

ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

ధర్మవరం అర్బన్: సంజయ్‌నగర్‌లోనున్న బీఎస్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో రెండురోజులపాటు ఫెసిలిటేషన్ సదుపాయం ఉంటుందన్నారు. ఏపీఓలతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే వారందరూ పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఓలు, ఏపీఓలకు సాయికృప జూనియర్ కళాశాలలో 4,6 తేదీలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయగా మొదటి రోజు 277 మంది రెండోరోజు 355మంది పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకున్నారని తెలిపారు.

ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే

- రోడ్ షోలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



రోడ్ షోలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: జెండాలు ఎన్ని జతకట్టినా, ఎంతమంది కలిసొచ్చినా ఏపీలో మళ్లీ ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే అని, ప్రజలందరి నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పాతబత్తలపల్లి సొంత పంచాయతీలోని ఎన్. ఎనుములవారిపల్లి నుంచి క్వార్టర్స్, చంద్రాయనిపల్లి, పాతబత్తలపల్లి, కే. బత్తలపల్లి, తోలేటిపల్లి మీదుగా పుల్లగూరపల్లి వరకు సోమవారం రాత్రి ఎమ్మెల్యే రోడ్ షో నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని, పుట్టపర్తి ఎమ్మెల్యేగా మీ బిడ్డ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. జగనన్న సీఎం అయితేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

గెలిచే సత్తా లేకనే పొత్తులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నపై ఒంటరిగా పోటీ చేసి గెలిచే సత్తా లేకనే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. పొత్తులు లేకుండా ఒంటరిగా చంద్రబాబు ఏనాడు ఎన్నికల్లో పోటీ చేయలేదన్నారు. 2014 ఎన్నికలకు ముందు 600పైగా అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం బాబు హామీలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. మీ బిడ్డ వల్ల కుటుంబంలో మంచి జరిగివుంటే నే మాకు ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడు వైఎస్ జగనన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

ఓటమి భయంతో దాడులు

పుట్టపర్తి నియోజకవర్గంలో ఓటమి భయంతో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడులు చేయిస్తున్నాడని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఎవరెన్ని కుట్రలు చేసినా పుట్టపర్తిలో తిరిగి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని విశ్వాసం వ్యక్తపర్చారు. ఎమ్మెల్యేగా, విప్‌గా, చీఫ్ విప్‌గా, మంత్రిగా పనిచేసిన పల్లె రఘునాథరెడ్డి నియోజకవర్గంలో చెప్పుకోదగిన ఒక్క అభివృద్ధి పనీ చేయలేదన్నారు. తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని, నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపి తీరుతామని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యకర్తల కేరింతలు, కోలాహలం మధ్య రోడ్ షో ఆద్యంతం అట్టహాసంగా సాగింది. మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి, సర్పంచ్ మాసే రెడ్డెమ్మ, ఎంపీటీసీ రాధయ్య, ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, నాయకులు రాజ శేఖర్‌రెడ్డి, నరసింహమూర్తి, ఏ. మధుసూదన్ రెడ్డి, రంగప్ప, రామప్ప, రెడ్డిశేఖర్, కొక్కంటి శ్రీనివాసరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, నారపరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయచంద్ర, నాగార్జునరెడ్డి, బడా వెంకట్రామిరెడ్డి, తోలేటి మోహన్‌రెడ్డి, క్రిష్ణవర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, హరినాథరెడ్డి, అంజినప్ప తదితర నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

నల్లమాడ: వంకరకుంట, రెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో టీడీపీకి చెందిన పలువురు సోమవారం ఆపార్టీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వంకరకుంట గ్రామానికి చెందిన రామాంజినేయులు, నారాయణస్వామి, గంగాదేవి, బసిరెడ్డిపల్లికి చెందిన శీనా, మునెప్ప, రెడ్డిపల్లికి చెందిన పెద్దన్న, గంగాద్రి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, ప్రసాద్, వ్యవసాయ సలహాబోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, ఓబిరెడ్డి, అరవిందరెడ్డి, యర్ర సూరి, ఈశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ రమణ, చంద్రహాసరెడ్డి, ప్రతాప్‌నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేడు నల్లమాడలో రోడ్ షో

నల్లమాడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు నల్లమాడ బస్టాండ్ కూడలి వద్ద ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్ షో నిర్వహించనున్నారు. ప్రముఖ సింగర్ నిర్మల రాథోడ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండలంలోని వేళ్లమద్ది పంచాయితీ కొత్తపల్లి తండాకు చెందిన సాయికుమార్‌నాయక్, నాగరాజునాయక్ టీడీపీని వీడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొజ్జేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి



రొద్దంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గౌనివారిపల్లి పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొద్దం: మండలంలోని కల్లుకుంట, నల్లూరు, చోళేమర్రి, బొమ్మిరెడ్డిపల్లి, పాతగొబ్బురంపల్లి, కొత్తగొబ్బురంపల్లి, రొద్దం తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పెనుకొండ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో తాము లబ్ధి పొందామని, తప్పకుండా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తామని ఓటర్లు చెప్పడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, ధనుంజయ, మారుతీరెడ్డి, నరసింహులు, బి.నారాయణరెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాము, రాజ్‌గోపాల్‌రెడ్డి, నల్లూరు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో సోమవారం ఆయా గ్రామాల బూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మల తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని పెనుకొండ నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహా పేర్కొన్నారు. పట్టణంలోని బోయగేరిలో నాయకులు సోమవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో ఇన్‌చార్జి గోపాల్, వెంకటరెడ్డిపల్లిలో వెంకటేష్, జీబీసీ కాలనీలో రఘునాథరెడ్డి, వజ్రాలపేటలో సుధాకరరెడ్డి ప్రచారం చేశారు. సంక్షేమాభివృద్ధిని వివరించి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, బోయ శాంతమ్మను మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరిపాళ్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. నాయకులు రామ్మోహన్‌రెడ్డి, ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, హనుమంతరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యామునాయక్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాలకూరులో..

సోమందేపల్లి: అన్ని వర్గాలకు జగనన్న చేసిన మేలు మర్చిపోవద్దని చాలకూరు సర్పంచ్ లలితమ్మ కోరారు. సోమవారం చాలకూరు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసప్ప, ఎంపీటీసీ నందిని తదితరులు పాల్గొన్నారు.



ఇస్లాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు



వెంకటగిరిపాళ్యంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చంద్రబాబు తప్పుడు హామీలు నమ్మొద్దు



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు 600 కు పైగా హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ విమర్శించారు. ప్రస్తుతం కూడా కూటమి పేరుతో ఎన్నో ఆచరణకు సాధ్యంకాని హామీలను గుప్పించారన్నారు. ప్రజలెవరూ ఆయన మోసపూరిత హామీలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి గోరంట్ల మేజర్ పంచాయితీ పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి, శింగిరెడ్డిపల్లి, కసిరెడ్డిపల్లి, శిరగంవాండ్లపల్లి గ్రామాల్లో ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నవరత్నాలతో అన్ని వర్గాలకు మంచి చేశారని కొనియాడారు. మరింత మంచి జరగాలంటే మరోసారి ఆయన్ను సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నవరత్నాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని అప్పట్లో ఎద్దేవా చేసిన చంద్రబాబు... నేడు అదే నోటితో ఇష్టానుసారం హామీలు గుప్పించడానికి సిగ్గుందా? అని ప్రశ్నించారు. కూటమికి సంబంధించిన మేనిఫెస్టోలో ప్రధాని మోదీ ఫొటో కాని, పురందేశ్వరి చిత్రం కాని లేదని, అపార్టీ నేతలు మేనిఫెస్టోను ముట్టుకోకపోవడం చూస్తే చంద్రబాబుతో ఎంత అపనమ్మకం ఉందో అర్థమవుతుందన్నారు.

సవిత 420

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితపై 16 కేసులున్నాయి. ఆమె 420. ఆమెను నమ్మి ప్రజలు ఓట్లు వేసి మోసపోవద్దని మంత్రి ఉషశ్రీచరణ్ ఘాటుగా విమర్శించారు. సవిత పెనుకొండను అనకొండగా మారుస్తుందని దుయ్యబట్టారు. సాధరణగా ప్రతి ఆడబిడ్డ పుట్టింటి వారు బాగుండాలని కోరుకొంటారని, అయితే సవిత తనకు జన్మనిచ్చిన కన్నతల్లిపైనే కనికరం లేకుండా కేసులు పెట్టిందని విమర్శించారు. ఎన్నో చీటింగ్, ఫోర్జరీ కేసులు సవితపైన ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతి ఒక్కరికీ వివరించి తన గెలుపునకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ సూచించారు. సోమవారం సోమందేపల్లిలోని లక్ష్మీ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



కస్సముద్రంలో ప్రచారం చేస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: ఈ నెల 13 వ తేదీన జరిగే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించి ఓటేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కస్సముద్రం, చెర్లోపల్లి, కంచనగారిపల్లి, కొత్తూరు, గాజులపల్లి, బలకవారిపల్లి గ్రామాల్లో జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీ, విభేదాల్లేకుండా పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీతోనే మరింత రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లోనే పాలన అందిస్తూ లంచాలకు తావు లేకుండా పథకాలన్నీ నేరుగా ఇంటికే చేరుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తప్పనిసరిగా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవిత శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి భారతి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పొట్టా పురుషోత్తమరెడ్డి, సొసైటీ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు మంజునాథరెడ్డి, లోకేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వైస్ సర్పంచ్ నాగరాజు, నారాయణస్వామి, క్రిష్ణారెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ కష్టాలు



పింఛన్ కోసం కుటుంబ సభ్యులతో కలసి బ్యాంక్ వద్దకు వెళ్తున్న వృద్ధురాలు బైలమ్మ

పెనుకొండ రూరల్: పింఛన్ కోసం ఇంకా లబ్ధిదారుల కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్లు తలుపు తట్టి ఠంచన్‌గా పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు వర్గీయుల ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించడంతో వారు పింఛన్ల పంపిణీకి దూరమయ్యారు. దీంతో పింఛన్‌దారులు పింఛన్ డబ్బుల కోసం అష్టకష్టాలు పడుతున్నారు. 40 డిగ్రీలకు పైబడి ఎండలు మండిపోతున్నా పండుటాలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. రొద్దం మండలం తురకలాపట్నంకి చెందిన బైలమ్మ (80) నడకలేని పరిస్థితి. తన భర్త గంగప్ప, మనమడు బైలాంజి సహాయంతో సోమవారం ద్విచక్ర వాహనంలో 12 కిలో మీటర్లు ప్రయాణించి పెనుకొండ పట్టణంలోని బ్యాంక్‌కూ వెళ్లారు. ఒకరి పింఛన్ కోసం మరో ఇద్దరు సహాయకులుగా బ్యాంకు చుట్టూ తిరగడం ఇబ్బందికరంగా మారిందని లబ్ధిదారురాలు బైలమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించండి



నల్లమాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పుట్టపర్తి ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ మూడో నెంబర్‌లోని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మహిళా విభాగం జిల్లా నేతలు మోదీనమ్మ, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, కుళ్లాయినాయక్, అంజినాయక్, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజినేయులు, పోలే వెంకటరెడ్డి, టౌన్ కన్వీనర్ గోవిందరెడ్డి, ఏఎన్ చంద్రశేఖర్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, సలీంబాషా, రఫీ, లక్ష్మినారాయణ, రవీ, ప్రకాష్, నారాయణస్వామి, ప్రతాప్‌నాయక్, శ్రీరాములు, జైనుల్లా తదితరులు పాల్గొన్నారు. అలాగే వంకరకుంట పంచాయితీలో మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి, సర్పంచ్ కుళ్లాయప్ప, మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఓబిరెడ్డి, అరవిందరెడ్డి, సచివాలయ కన్వీనర్లు నాగప్ప, హైదరాబాద్ ఓబిరెడ్డి, పాపిరెడ్డి ఇంటింటా ప్రచారం చేపట్టారు.

రోగులకు అన్నదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ నారాయణ సేవా సమితి సభ్యులు రోగులకు అన్నదానం చేశారు. శ్రీవాసవీ నారాయణ సేవా సమితి సభ్యులు ఓవీ ప్రసాద్, కాకుమాను సాగర్, శ్రీహరి, బాలాజి, బాబు, చిప్పల రఘు, ప్రసాద్, యతిరాజులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామంలో సోమవారం ఎస్ఐ లింగన్న ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ మాట్లాడుతూ గ్రామంలో శాంతి యుతంగా ఎన్నికలు నిర్వహించేలా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే చర్యలు తప్పవు

బత్తలపల్లి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఓబుళాపురం, ఉప్పర్లపల్లిలో తమ సిబ్బందితో కలిసి ఆయన కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అలాగే రౌడీషీటర్లు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు తిరుపాలు, సోమశేఖర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈశ్వరమ్మకు ఘన నివాళి



ఈశ్వరమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు

పుట్టపర్తి రూరల్: సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్థంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం సమాధి రోడ్డులో ఉన్న సత్యసాయి తల్లిదండ్రులు పెద్ద వెంకమరాజు, ఈశ్వరమ్మ సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఈశ్వరమ్మ, సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు దంపతులు ఈశ్వరమ్మ ,పెద్ద వెంకమరాజుల సమాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. సత్యసాయి ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, రత్నాకరం వంశీయులు ఈశ్వరమ్మకు నివాళులర్పించారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.